

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 17 సెప్టెంబర్ 2025 పేజీలు : 04


# సీఎం సమీక్ష సమావేశంలో అనంత కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్



శాంతి భద్రతల అంశంపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశంలో పాల్గొన్న అనంతపురం జిల్లా ఎస్పీ మరియు కలెక్టర్

**అనంతపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త బ్యూరో**

రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర నిర్వహించిన రెండో రోజు సమావేశంలో అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ, ఆనంద్, జిల్లా ఎస్పీ పి, జగదీష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దిశ నిర్దేశం చేశారని టెలిఫోన్ ద్వారా సమాచారం తెలిపారు. అత్యుత్తమ పనితీరు టెక్నాలజీ, ఇన్నోవేషన్లను అమలు చేయటం పోలీస్ శాఖలో చాలా కీలకం. యూరియా అంశంలో కొందరు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారు. రాష్ట్రంలో కొరత ఉందని వదంతులు సృష్టించి శాంతిభద్రతల సమస్య తీసుకురావాలనే ప్రయత్నం జరిగింది. అమెరికా నుంచి 750కి పైగా తప్పుడు పోస్టులు పెట్టారు. రైతులుప్రభుత్వం మధ్య వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. ఇలాంటి వాటినే రియల్ టైమ్ గవర్నెన్సులో విశ్లేషించి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కలెక్టర్ లకు చంద్రబాబు సమీక్ష సమావేశంలో తెలియజేశారు. క్రైమ్ రేట్ 4 శాతం మేర, సైబర్ క్రైమ్ 16 శాతం పెరిగిందని చెబుతున్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలి

# ముఖ్యమంత్రి సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ



జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజు సమావేశంలో పాల్గొన్న పుట్టపర్తి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్‌లు

**పుట్టపర్తి (కలెక్టరేట్), సెప్టెంబర్ 16, ప్రభాతవార్త**

రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఉదయం ప్రారంభమైన రెండవ రోజు జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ లు పాల్గొన్నారు.

నాలుగవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఉదయం మొదటి సెషన్ లో స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ, ఐటీ, ఆదా యార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా పారిశుద్ధం, ప్రజా అవగాహన వంటి అంశాలపై, అలాగే స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, పురపాలక మరియు పట్టణ అభివృద్ధి, కాలుష్య నియంత్రణ మండలి మరియు అటవీశాఖల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.

మధ్యాహ్నం రెండవ సెషన్ లో భోజన విరామం అనంతరం లా అండ్ ఆర్డర్ పై డీజీపీ, జిల్లా ఎస్పీలతో ముఖ్యమంత్రి సమీక్షించినట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.

# మహిళల అభివృద్ధి కోసం వ్యాలీ గ్రీన్ గార్మెంట్

-వ్యాలీ గ్రీన్ గార్మెంట్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించండి

- ఏపీ ఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌ని కలిసిన టిడిపి నాయకులు వ్యాలీ గ్రీన్ గార్మెంట్ అధినేత పిజెఆర్

- త్వరలో ఏర్పాటు చేస్తామన్న ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీలక్ష్మి



ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీలక్ష్మి పుష్పగుచ్చం అందజేస్తున్న పిజెఆర్

**అనంతపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలం గజరాంపల్లి గ్రామంలో ఉన్నటువంటి వ్యాలీ గ్రీన్ గార్మెంట్‌లో వర్క్ చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని అనంతపురం జిల్లా ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీలక్ష్మిని అనంతపురంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి టిడిపి సీనియర్ నాయకులు వ్యాలీ గ్రీన్ గార్మెంట్ అధినేత పెరుమాళ్ళ జీవానంద రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీజేఆర్ మాట్లాడుతూ పిజెఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్ట్ ద్వారా పది సంవత్సరాల నుండి వివాహాలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని గత రెండు వ్యాలీ గ్రీన్ గార్మెంట్‌లో పని చేస్తున్న మహిళలకు ఉచితంగా బస్సులు కల్పించామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత పథకాలని ప్రజలకు చేరు వేసే విధంగా సహకరించాలని కొన్ని లక్షల మంది మహిళల కోసం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వ్యాలీ గ్రీన్ గార్మెంట్‌లో పని చేస్తున్నటువంటి మహిళలకు ఉచిత బస్సు కల్పించాలన్నారు. ఆర్ఎం మాట్లాడుతూ.. త్వరలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్‌లో ఉన్నటువంటి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. మహిళల అభివృద్ధి కోసం మహిళలకు చేయూతనందిస్తున్న వ్యాలీ గ్రీన్ గార్మెంట్ సంస్థని రీజనల్ మేనేజర్ అభినందించారు.

# 19న మెగా డీఎస్సీ నియామక ఉత్తర్వులు అందజేత

- ఒకరోజు ముందే అభ్యర్థులు ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసాము - డీఈఓలు ప్రసాద్ బాబు, క్రిష్టప్ప వెల్లడి



మాట్లాడుతున్న డీఈఓలు ప్రసాద్ బాబు, క్రిష్టప్ప

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 ప్రభాతవార్త**

మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందజేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రసాద్ బాబు, క్రిష్టప్ప తెలిపారు. మంగళవారం అనంతపురం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వము మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ను విడుదల చేసిందని, అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి 811 టీచర్ పోస్టులు ఉన్నాయన్నారు. పరీక్షలు నిర్వహించిన తర్వాత ప్రొవిజినల్ జాబితా ప్రకారం 755 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచామన్నారు. ఈ ప్రక్రియ మొత్తం పీవీకేకే లోని శ్రీ బాలాజీ పీజీ కళాశాలలో జరిగిందన్నారు. ఈ ప్రక్రియలో అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పొందుపరిచిన ఒరిజినల్ దరఖాస్తులను 16 ప్రత్యేక టీం సభ్యులతో పరిశీలించి అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. 811 పోస్టులకు 56 మంది అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో ఎస్జిటి ఉర్దూ, స్కూల్ అసిస్టెంట్ ఉర్దూలో పోస్టులు మిగిలిపోయాయన్నారు. నలుగురు అభ్యర్థులపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేసి ముగ్గురు అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందన్నారు. తుది ఎంపిక జాబితాను కమిషనర్ సోమవారం విడుదల చేయడం జరిగిందన్నారు. ఆ జాబితాను కూడా ఒకసారి పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేశామన్నారు.

## 18న విజయవాడకు అభ్యర్థులు:

మెగా డీఎస్సీ తుది జాబితాలో ఎంపికైన 755 మంది అభ్యర్థులను ఈనెల 18వ తేదీ సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రం అయిన పీవీకేకే కళాశాల నుండి ఉదయం 7 గంటలకు 45 ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు పిల్చుకు వెళ్తామన్నారు. అభ్యర్థులతో పాటు ఒకరిని వెంట పిల్చుకు వెళ్తున్నామని, బయలుదేరే సమయంలో అందరికీ టిఫిన్ కూడా ఏర్పాటు చేశామని, మార్గమధ్యంలో బద్వేల్ దగ్గర మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేశామని, సాయంత్రానికి గుంటూరు చేరుకొని అక్కడ వసతి ఏర్పాటు చేసిన చోటకు చేరుకుంటామని, అక్కడ కూడా భోజనం, వసతి ఏర్పాటు చేశామన్నారు.

## 19న నియామక ఉత్తర్వులు అందజేత:

మెగా డీఎస్సీ అభ్యర్థులు శుక్రవారం మధ్యాహ్నం 1:30 గంటలకు విజయవాడకు చేరుకొని అక్కడ ఎంపిక చేసిన వేదిక వద్ద కేటాయించిన గ్యాలరీలో తాము ఇచ్చే ఐడి కార్డులతో కూర్చోవాలన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి ఆరు అరగంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్ హాజరవుతారన్నారు. అభ్యర్థులకు ఒక షీల్డ్ కవరు అందజేస్తామని, అందులో ఆర్డర్ కాపీ, ఒక ప్రతిజ్ఞ కాపీ, ఒక శిక్షణ కు సంబంధించిన కాపీ, మరొకటి ముఖ్యమంత్రి సందేశానికి సంబంధించిన కాపీ ఉంటుందన్నారు. తిరిగి అదే రోజు సాయంత్రం అక్కడనుండి బయలుదేరి శనివారం ఉదయం అనంతపురం చేరుకుంటామన్నారు.

## ఐదు బస్సులకు ఒక డాక్టర్

మెగా డీఎస్సీ అభ్యర్థులు, వారి వెంట వచ్చిన తల్లి లేదా తండ్రి, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది కలిసి విజయవాడకు వెళ్లడానికి 45 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఐదు బస్సులకు ఒక డాక్టర్ చొప్పున 9 మంది డాక్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అదేవిధంగా ఒక బస్సులో నలుగురు సహాయకులు ఉంటారని, అందులో ఒక విద్యాశాఖ ఉద్యోగి, ఒక పీడీ, ఒక పీఈటీ, మరొకరు ఉంటారన్నారు.

## 22 నుండి 29 వరకు శిక్షణ:

మెగా డీఎస్సీలో ఎంపికైన 755 మంది టీచర్లకు ఈనెల 22వ తేదీ నుండి 29వ తేదీ వరకు ఏడు రోజులపాటు తిరుపతిలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## అభ్యర్థులు వెంట తెచ్చుకోవాలి:

విజయవాడకు వస్తున్న మెగా డీఎస్సీ అభ్యర్థులతో పాటు వచ్చే సహాయకులు ఆధార్ కార్డ్, రగ్గు, తలదిండ, గొడుగు, స్వెటర్ తెచ్చుకోవాలన్నారు.

## నకిలీ సర్టిఫికెట్లు అభ్యర్థులపై తదుపరి చర్యలు:

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనలో పలు నకిలీ సర్టిఫికెట్లు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. డీఎస్సీ ప్రక్రియ ముగిసిన తర్వాత నకిలీ సర్టిఫికెట్లు అందజేసిన అభ్యర్థులపై తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి శ్రీనివాసులు, ఉప విద్యాశాఖ అధికారులు శ్రీనివాస రావు, జాన్ రెడ్డప్ప, పర్యవేక్షకులు ఆదినారాయణ, ఏపీవో మంజునాథ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మరణ ధృవీకరణ పత్రానికి సంవత్సరంలోపు దరఖాస్తు చేసుకోవాలి

- లేదంటే ధృవీకరణం రానివైనం - ఇది రాష్ట్ర వ్యాప్త సమస్య పరిష్కారం చూపండి

- వందలాది మంది మరణ ధృవీకరణ పత్రాల కోసం పడిగాపులు



**అగళి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

ఎవరైనా మృతి చెందితే లేదా జన్మిస్తే జనన, మరణ ధృవీకరణ పత్రాలను సంవత్సరం లోపు తీసుకోవాలి, జనన మరణ ధృవీకరణ పత్రాల కోసం 21 రోజుల్లో పంచాయితీ కార్యాలయాలకు సమాచాం అందించి తీసుకోవాల్సి ఉంటుంది. గ్యార గొండనపల్లికి చెందిన ఒక వ్యక్తి వారి ఇంటిలో మృతి చెందిన వారి మరణ ధృవీకరణ పత్రం కోసం తహశీల్దారు కార్యాలయానికి వచ్చారు. వారు మృతి చెంది సంవత్సరం పైన కావడంతో మేము మరణ ధృవీకరణ పత్రాన్ని ఇవ్వడం కుదరదని తహశీల్దారు సుబ్బారావు తెలిపారు. జనన/మరణ ధృవీకరణ పత్రాలను పొందాలంటే 21 రోజుల్లో పంచాయితీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని, సంవత్సరం లోపు అయితే ఆ సర్టిఫికెట్ ఇ వ్వడానికి మనకు అవకాశం ఉందని తెలిపారు. 2005, 2009, 2010, 2015, 2000, 1995, 1997 ఇలా గత సంవత్సరాల్లో జనన, మరణ పొందిన వారు, ఏదో కారణాల రీత్యా సర్టిఫికెట్లను పొందలేదు, ఇలా వందలాది మందికి మరణ/జనన ధృవీకరణ పత్రాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఆ సర్టిఫికెట్ల కోసం వందలాది మంది తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీనికి పరిష్కారం లేదన్నట్లుగా మాట్లాడుతున్నారు. రేషన్‌కార్డులో వారి పేర్లు తీసివేయాలన్నా తప్పనిసరిగా మరణించిన వ్యక్తి మరణ ధృవీకరణ పత్రం ఉండాలి. భర్త, తండ్రి, తల్లి చనిపోతే పెన్షన్లకోసం డెత్ సర్టిఫికెట్ తప్పనిసరి, భూములు బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్న డబ్బును తీసుకోవాలన్నా, మరణ ధృవీకరణ పత్రం తప్పనిసరి. ఏ విషయంలోనైనా ఆలస్యమనేది జరుగుతుంది. ఒక సంవత్సరం తర్వాతో, రెండు సంవత్సరాల తర్వాతో ఆ సర్టిఫికెట్లు అవసరమై కార్యాలయాలకు వెళ్తే ఆ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని గతంలో మృతి చెందిన వారి మరణ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం కోసం ప్రత్యేకమైన చొరవ తీసుకోవాల్సి ఉంది. గతంలో ఇలాంటి వాటికి ఆర్డిఓ కార్యాలయానికి రిపోర్టు పంపి మరణ ధృవీకరణ పత్రాలను ఇస్తామని చెప్పారు కానీ వందలాది మందికి రిపోర్టులు పంపారు కాని, మరణ ధృవీకరణ పత్రాలు ఒక్కరికి కూడా రాలేదు. ఇలాంటి వాటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయండి

- జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ

- ప్రజా సమస్యలపై గళమెత్తిన సభ్యులు - వాడి వేడిగా జడ్పీ సర్వ సభ్య సమావేశం

- ఆర్డిటి, ఎఫ్‌సిఆర్ఏను కొనసాగించాలి, మెడికల్ కళాశాలల కొనసాగింపుపై తీర్మాణం







సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, సమావేశానికి హాజరైన జడ్పీటిసిలు

**అనంతపురం సిటీ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ సూచించారు. జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని జడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ, జాయింట్ కలెక్టర్లు శివనారాయణ్‌శర్మ, అభిషేక్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో సమావేశాలలో ప్రజా ప్రతినిధులు తీసుకొస్తున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా విద్య, వైద్యం, వ్యవసాయం, నీటి పారుదలతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు తోడ్పాటును అందించాలని సూచించారు. ఎంపి అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు అవుతున్న వివిధ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధికి పాటుపడుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖపై జరిగిన సమీక్షలో తల్లికి వందనం అర్హతలు ఉన్నా అర్హులకు అందలేదని సాంకేతిక సమస్యల పేరిట అధికారులు కాలయాపన చేస్తున్నారని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జడ్పీ చైర్మన్ ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోకుండా ఆయా విభాగాల అధికారులంతా సమన్వయంతో పని చేసి అర్హులందరికీ అందేలా చూడాలని సూచించారు. అదే విధంగా జిల్లాకు వర ప్రసాదిని అయిన ఆర్డిటి సంస్థ గత 30 సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని, ఎఫ్‌సిఆర్ఏ కొనసాగించక పోవడం వల్ల నిధులు అందక సంస్థ సేవలను ఆపివేసే పరిస్థితి ఏర్పడిందని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏ కొనసాగించేలా జిల్లా పరిషత్ తరుపున ఏకాభిప్రాయంతో తీర్మాణాన్ని ఆమోదించారు. అదే విధంగా జిల్లాకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేసి పేద విద్యార్థులకు లబ్ధి చేకూర్చే దిశగా చర్యలు తీసుకోవాలంటూ తీర్మాణాన్ని ఆమోదించారు. ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పరిష్కరించాలని సభ్యులు సూచించారు. పలు అంశాలపై వాడి వేడిగా చర్చించారు. సమావేశంలో జడ్పీ సిఇఓ శివశంకర్, డిప్యూటీ సిఇఓ వెంకట సుబ్బయ్యతోపాటు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాకు 3247 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది

రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి : జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ



ఉమా మహేశ్వరమ్మ

**అనంతపురము కలెక్టరేట్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లాలో మంగళవారం వివిధ రైతు సేవా కేంద్రాల్లో 346 మెట్రిక్ టన్నులు, సొసైటీ లలో 204 మెట్రిక్ టన్నులు మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద 565 మెట్రిక్ టన్నులు, హోల్ సేల్ డీలర్లు మరియు ఏపీ మార్క్ఫెడ్ వద్ద 1479 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోదాములలో 112 మెట్రిక్ టన్నులు అలానే రవాణా క్రింది 542 మెట్రిక్ టన్నులు మొత్తంగా జిల్లాలో 3247 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో వ్యవసాయ అధికారిని యూ. ఉమా మహేశ్వరమ్మ చెప్పారు. మంగళవారం ఆర్ సి ఎఫ్ కంపెనీ ద్వారా1482.3 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావడం జరిగింది. ఇందులో ఏపీ మార్క్ఫెడ్ కు 899 మెట్రిక్ టన్నులు, మరియు ప్రైవేట్ డీలర్లకు 583.3 మెట్రిక్ టన్నులు సరఫరా చేయబడుతుంది. వ్యవసాయ అధికారుల ద్వారా ప్రతి గ్రామము, ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో యూరియా వాడకం మీద ప్రతిరోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని. వ్యవసాయ అధికారిని యు. ఉమా మహేశ్వరమ్మ చెప్పారు.

# అంచలంచెలుగా అపరిష్కృత సమస్యలకు పరిష్కారం

- కూటమి ప్రభుత్వం నుండి త్వరలో తీపి కబురు

- నా మీద ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయను రాష్ట్ర జేఏసీ, ఏపీ ఎన్ జి జి ఓ అధ్యక్షులు ఆళ్లపాటి విద్యాసాగర్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జేఏసీ, ఏపీ ఎన్ జి జి ఓ అధ్యక్షులు ఆళ్ల పాటి విద్యాసాగర్



అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన లింగ రామ్మోహన్ ను సన్మానిస్తున్న దృశ్యం

**శ్రీ సత్యసాయిజిల్లా, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త ప్రతినిధి**

ఎన్నో సంవత్సరాలుగా ఆవిష్క ృతమైనటువంటి ఉద్యోగుల సమస్యలను అంచలంచెలుగా ఒక్కొక్కటి పూర్తి చేసుకుంటూ రావడం గర్వంగా ఉందని రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు, ఏపీ ఎన్ జి జి ఓ అధ్యక్షులు కామ్రేడ్ ఆళ్ళ పాటి విద్యాసాగర్ పేర్కొన్నారు. మంగళవారం నూతనంగా ఏర్పాటు అయినటువంటి శ్రీ సత్య సాయి జిల్లా ఎన్ జి జి ఓ ఎస్ నూతన అడ హక్ కమిటీ నియామక ప్రక్రియలో ఆయనతో పాటు, ఏపీ ఎన్జీ జి ఓ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.వి. రమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి లింగ రామ్మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆళ్లపాటి విద్యాసాగర్ మాట్లాడుతూ, వేల మంది ఉద్యోగ మిత్రులు నాపై నమ్మకంతో విశ్వాసంతో రాష్ట్ర జేఏసీ అధ్యక్షులుగాను మరియు ఏపీ ఎన్ జి జివో అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఉద్యోగి సమస్యలు ఎదుర్కోవడానికి ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు. త్వరలోనే డీఎలు మరియు పి ఆర్ సి ని ప్రభుత్వం ప్రకటిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల శ్రేయస్సు కోరి అతి త్వరలోనే తీపికబురును అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన పై ఉంచిన నమ్మకాన్ని శక్తి వంచన లేకుండా కష్టపడి నెరవేరుస్తానన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ మాట్లాడుతూ ఉద్యోగుల యొక్క ప్రతి అంశముపై అవగాహన కలిగినటువంటి ఏకైక వ్యక్తి రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ అని తెలియజేశారు. ఉద్యోగుల యొక్క సంక్షేమము, సమస్యలను అధిగమించడంలో నిరంతరం కృషి చేయడం అభినందనీయం అన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, తాలూకా స్థాయి నాయకులు రాష్ట్రస్థాయి అధ్యక్షుల పనితీరును కొనియాడారు. అనంతరం శ్రీ సత్య సాయి జిల్లా అడహక్ కమిటీని ప్రకటించారు. అడ హక్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా లింగ రామ్మోహన్, కమిటీ మెంబర్లుగా శంకర్ నారాయణ, కదిరి వేణుగోపాల్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి,ఈశ్వరప్ప లలితమ్మ,శంకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మాధవ, ప్రసాద్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రంజిత్ నాయుడు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సి సుబ్బారెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు బి చంద్రశేఖర్ రెడ్డి, అనంతపురం కార్యదర్శి డి చంద్రమోహన్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, ఆ జిల్లా కార్యదర్శి రమేష్, విజయవాడ సిటీ యూనిట్ అధ్యక్షులు ప్రసాదు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, అనంతపురం మహిళా వింగ్ అధ్యక్షురాలు జమీల బేగం, కడప జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు, కడప కార్యదర్శి నిత్యపూజయ్య, ఏపీ కమర్షియల్ టాక్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్ బాబు, రాష్ట్ర అగరికల్చర్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

02ATP16_02ATP16.qxd 16-09-2025 PM 10:49 Page 1



## హిందూ స్మశాన వాటికలో ముళ్ల చెట్లు తొలగింపు

-దసరా రోజు పెద్దల పూజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ఉరవకొండ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



**హిందూ స్మశాన వాటికలో ముళ్ల చెట్లను జేసీబీతో శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్, వార్డు సభ్యులు, టీడీపీ నాయకులు**

పట్టణంలోని వెలిగొండ రోడ్డులోగల హిందూ స్మశాన వాటికలో ఏపుగా పెరిగిన ముళ్లచెట్లను మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జేసీబీతో శుభ్రం చేయించారు. స్మశాన వాటికలో ముళ్లచెట్లు విపరీతంగా పెరిగిపోవడంచేత మరణించిన వారి దహన సంస్కారాలు, ఇతరత్రా పూజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు, వివిధ సంఘాలు పంచాయతీ దృష్టికి తీసుకెళ్లిన క్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ వార్డు సభ్యులు, టీడీపీ నాయకులతో కలిసి స్మశాన వాటికను సందర్శించి జేసీబీతో ముళ్లచెట్ల తొలగింపును చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ అక్టోబర్ 2న జరిగే విజయ దశమి పర్వదినం రోజు అనేక మంది తమ పెద్దల సమాధులను దర్శించి పూజలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది ఇందుకు ఇబ్బందులు లేకుండా చూడటానికి స్మశాన వాటికను శుభ్రం చేయించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పి.నిరంజన్‌గౌడ్, ఎం.రామాంజినేయులు, చేజాల ప్రభాకర్, మీనుగ రవి, టీడీపీ సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద, కట్టుబడి ఖలందర్, మీనుగ పెద్దన్న, పంచాయతీ మేస్త్రీలు లేపాక్షి, మహేష్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## స్వస్థ నారి-సశక్తి పరివార్ అభియాన్‌పై శిక్షణా కార్యక్రమం

-వివిధ అంశాలను వివరించిన వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్

ఉరవకొండ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్

మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీలో మంగళవారం స్వస్థ నారి-సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంపై పారామెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళలు బలమైన కుటుంబానికి మూలమన్న ఉద్దేశంతో మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేలా చేయడానికిగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయన్నారు. ఇందులో భాగంగా ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2 వరకు పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులను అందించడం జరుగుతుందన్నారు. ముక్కు, చెవి, గొంతు సంబంధించిన సమస్యలు, మధుమేహం, క్యాన్సర్, ప్రసూతి సేవలు, రక్తహీనత తదితర పరీక్షలు చేయడం జరుగుతుందని ఈ విషయాలను మహిళలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరంగయ్య, సూపర్‌వైజర్ శేఖర్, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లబ్దిదారుల ఇబ్బందులు దూరం చేయడానికి స్మార్ట్ రేషన్ కార్డులు

-స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో లత్తవరం మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప

ఉరవకొండ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం



అంబేద్కర్ నగర్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ దృశ్యం

రేషన్ కార్డు లబ్దిదారుల ఇబ్బందులను దూరం చేయడానికే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప అన్నారు. మండల పరిధిలోని లత్తవరం గ్రామంలోని సచివాలయంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీను వీఆర్‌వో షేక్షావలి, గ్రామ కార్యదర్శి శోభన్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, ఎఫ్‌పీ షాపు డీలర్లు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**ఉరవకొండలో...**

పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలోని 64వ ఎఫ్‌పీ షాపు పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద ముఖ్య అతిథిగా హాజరుకాగా లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో ఉలిగన్న, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ మనిషా, వార్డు సభ్యుడు ఎం.రామాంజినేయులు, ఎఫ్‌పీ షాపు డీలర్ మీనుగ సులోచన, టీడీపీ నాయకులు చాబాల ఈశ్వరయ్య, వరప్రసాద్, తిప్పన్న, నరసింహులు, బుడబుక్కల గోపాల్, సాకే సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

గుత్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని 19వ బ్లాక్ పరిధిలో వున్న బిసి కాలనీలో మంగళవారం వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వార్డు ఇన్‌చార్జ్ రామకృష్ణ, విఆర్ఓ ఆదినారాయణమ్మ ఆధ్వర్యంలో కార్డుదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాబుసాహెబ్, లక్ష్మీ కళ్యాణి, భీమలింగ, సురేష్, బాబు, మెడికల్ సురేంద్ర, రంగనాయకులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల మీట్

గుత్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

గుత్తి మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ప్రభాకర్‌నాయక్, ఎంపిపి విశాలాక్షి తెలిపారు. ఈ సమావేశానికి జెడ్‌టిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

## నేటి నుండి ఆరోగ్యవంతమైన మహిళలు - శక్తివంతమైన కుటుంబం

-వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప

గుత్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



8వ జాతీయ పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని నేటి నుండి వచ్చే నెల 2వతేదీ వరకు ఆరోగ్యవంతమైన మహిళలు - శక్తి వంతమైన కుటుంబం కార్యక్రమం మేరకు మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, ఆరోగ్య సేవలను సులభతరం చేయటం, జీవనశైలి పట్ల అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 19న ఆసుపత్రిలో మెగా వైద్య శిబిరాన్ని వివిధ విభాగాల వైద్య నిపుణులతో నిర్వహిస్తామన్నారు. మహిళలకు, కిషోర బాలికలకు రక్తపోటు, క్యాన్సర్, మధుమేహం, అనీమియా, క్షయ తదితర వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకై ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మహిళల సంక్షేమమే ప్రాధాన్యతగా శక్తివంతమైన కుటుంబాలు రూపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని మహిళలు, కిషోర్ బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గుత్తిలో విద్యుత్ కార్మికుల ధర్నా

గుత్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



విద్యుత్ సిబ్బంది ధర్నా చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట మంగళవారం విద్యుత్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పాత పెన్షన్ అమలు చేయాలని, డిఏ బకాయిలు చెల్లించాలని, జూనియర్ లైన్‌మెన్లను గ్రేడ్-2 ఉద్యోగులుగా పరిగణించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్రప్రసాద్, శేషావలి, కుమార్, రఫీ, సాయి ప్రకాష్, వెంకటేష్, సూర్యనారాయణ, ఆంజనేయులు, హాజీబాష, తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

-యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్

గుంతకల్లు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న శ్రీనివాసులు

సుదీర్ఘకాలంగా ఉపా ధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్ అన్నా రు. రెండు రోజుల క్రితం కర్నూ ల్‌లో ప్రారంభమైన యుటిఎఫ్ రణభేరి ప్రచారజాత మంగళవారం గుంతకల్లుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సరోజినీనాయుడు పురపాలక బాలికల ఉన్నత పాఠశాల నుండి హనుమాన్ సర్కిల్ వరకు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ నాయకులు శ్రీనివాసులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామన్న కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్‌సి, ఐఆర్ ప్రకటిస్తామని పెడచెవిన పెట్టిందన్నారు. అధికారం చేపట్టి 15 నెలలు గడిచినా ఇప్పటివరకు పెండింగ్‌లో వున్న 4 డిఏలు, గత పిఆర్‌సి బకాయిలు 30 వేల కోట్లు ఉపాధ్యాయులకు చెల్లించాల్సి వుందన్నారు. పిఆర్‌సి కమీషన్ నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల నేతలతో చర్చలు జరిపి సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు రాజశేఖర్, రాజ్‌కుమార్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

-కమర్షియల్ ట్యాక్స్ అధికారికి సిపిఐ ఎంఎల్ వినతి

గుంతకల్లు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



సిటిఓ సురేంద్రరెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు కమర్షియల్ ట్యాక్స్ అధికారి సురేంద్రరెడ్డికి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆ పార్టీ డివిజన కమిటీ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఏసిటిఓగా పనిచేస్తున్న విజయ్‌కుమార్, అటెండర్ జిలాన్‌లు కలిసి జీరో వ్యాపారుల నుండి నెలవారి మామూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రధానంగా టపాసులు, బట్టల దుకాణాలు, మంచి నూనె, బంగారు వ్యాపారులు, మందుల ఏజెన్సీలు, ఎరువుల దుకాణాలు, మార్వాడీలు నిర్వహిస్తున్న హోల్ సేల్ వ్యాపారస్తుల నుండి డబ్బులు వసూలు చేస్తూ ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు నష్టం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. వారిద్దరిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో డివిజన్ కమిటీ సభ్యులు సత్తార్, రామాంజనేయులు, ఐఎఫ్‌టియు నాయకులు నారాయణ, బాషా, విశ్వనాథ్, నాగార్జున, తదితరులు వున్నారు.

## మాదిగల కృతజ్ఞత సభను విజయవంతం చేయండి

గుంతకల్లు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



ఈనెల 22న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న మాదిగల కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ భీమలింగ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు చట్టం చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపేందుకు కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మాదిగలు, మాదిగ ఉపకులాలు, విద్యార్థులు, మేధావులు వేలాదిగా తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, సంపత్, హనుమేష్, రామాంజి, మస్తాన్, పక్కీరప్ప, ఆంజనేయులు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా అధికంగా వాడితే దిగుబడి తగ్గుతుంది

బత్తలపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



రైతులు యూరియా అధికంగా వాడడం వలన చీడపీడల నివారణ శక్తి తగ్గడమే కాకుండా, దిగుబడి సైతం తగ్గుతుందని ఏడిఏ లక్ష్మనాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దంపెట్ల గ్రామం లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మా నాయక్, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు. ఏ డి ఏ లక్ష్మానాయక్ గారు రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. అధిక మోతాదులో యూరియా వాడడం వలన పంటలకు చీడపీడలకు తట్టుకునే సామర్థం తగ్గడంతో పాటు దిగుబడి తగ్గుతుందన్నారు. అదేవిధంగా ఖరీఫ్ లో పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

## మహిళలకు ఉచిత ఆరోగ్య శిబిరం

బత్తలపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



వైద్యాధికారి అరుణ్ కుమార్ ఫైల్ ఫోటో

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యకరమైన మహిళలు బలమైన కుటుంబాలు) కార్యక్రమంలో భాగంగా మహిళలందరికీ ప్రారంభోత్సవ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి అరుణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు కానుకగా మహిళలందరికీ ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు అందాయన్నారు. ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు మేరకు స్వస్త్ నారి, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధులకు ( బిపి, షుగర్, క్యాన్సర్), గర్భనీ స్త్రీలు, బాలింతలు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, పంటి వ్యాధులకు, టీబి వ్యాధిగ్రస్తులకు, రక్తహీనత గలవారు మరియు పోషకాహారం పై అవగాహన, పి ఎం జె ఏ వై నమోదు, సికిల్ సెల్ అనీమియా, రక్తహీనత పరీక్షలు, నిర్వహించబడునన్నారు. అంతేకాకుండా ప్రతి సచివాలయ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలందు కూడా ఈ వైద్య శిబిరాలను బుధవారం నుండి నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కనుక మండలంలోని మహిళలందరూ ఈ ఉచిత వైద్య శిబిరములలో పాల్గొని చికిత్సలు చేయించుకోవాలని కోరారు.

## గిట్టుబాటు ధర వచ్చేంతవరకు టమోటా సాగు చేయొద్దు...!

రైతులకు జిల్లా ఉద్యానవనాధికారి సూచన..

ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 16 ప్రభాత వార్త

గిట్టుబాటు ధర లభించేంతవరకు టమోటా పంట సాగును చేయొద్దని జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా టమోట రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ధర్మవరం నియోజకవర్గం వ్యాప్తంగా 480 హెక్టార్లు టమోటా పంట సాగు అధికంగా ఉందని గిట్టుబాటు ధర లేక రైతులు ప్రస్తుతం నష్టాల బాటలో పయనిస్తున్నారని ప్రస్తుతం సాగు చేసిన టమోటా పంట ఇంకా రెండు మూడు నెలల కోతలు ఉంటాయని కావున ధర ఇంకా పతనం అయ్యే అవకాశం ఉంటుందని గిట్టుబాటు ధర వచ్చేంతవరకు రైతులు కాస్త ఓపికతో టమోటా పంట సాగు ను చేయొద్దని పంటను సాగు చేసి నష్టల బాటలో రైతులు పడొద్దని జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ రైతులకు సూచనలు అందించినట్టు ధర్మవరం ఉద్యానవన అధికారిని అమరేశ్వరిదేవీ తెలియజేశారు.

## ఘనముగా యేసుక్రీస్తు శాంతి సువార్త పాస్టర్లకు నిత్యావసర సరుకుల పంపిణీ

గుమ్మఘట్ట సెప్టెంబర్ 16 ప్రభాత వార్త

మండల పరిధిలోని గోనబావి గ్రామంలో మంగళవారం ముఖ్య అతిథులు పరంజ్యోతి ఏలియా చల్లా కిషోర్ సురేష్ చేతుల మీదుగా సేవకులకు నిత్యవసర నిత్యవసర సామాగ్రి పంపిణీ దేవుని కృపలో మండల పరిధిలో గోనబావి గ్రామంలో సువార్త స్వగృహమునందు ప్రత్యేక సేవకులు సదస్సు మరియు గ్రామంలో యేసుక్రీస్తు శాంతి సువార్త పరిచర్య దేవుడు ఘనంగా జరిగించినాడు యేసుక్రీస్తు సమస్త మానవాళికి శాంతి సమాధానాన్ని ఇవ్వడానికి వచ్చాడని క్రమము మంచితనము జాలి దయ మంచి గుణ లక్షణాలు యేసుప్రభువు దేవుని వలె కలిగి ఉండాలని అందరూ సన్మార్గంలో జీవించాలని దైవజనులు పరంజ్యోతి తెలిపారు సాటి మనసులకు ఒకరికొకరు మంచి మనసుతో సహాయం చేసే గుణం అలవర్చుకోవాలని దైవజనులు ఏలియా వివరించారు ,యేసుక్రీస్తు సిలువ రక్తం ద్వారా మానవుల పాపములన్ని క్షమించబడ్డాయని విశ్వసించిన వారికి నిత్యజీవం లభిస్తుందని కళ్యాణదుర్గం తాలూకా పాస్టర్ అసోసియేషన్ చల్లా కిషోర్ చౌదరి తెలిపారు , సద్గుణము కలిగి భవిష్యత్ తరాలకి మంచి శ్రేయస్సు ఉండే విధముగా అందరు కూడా పొరుగు వారికి ఒకరికొకరు సహాయం చేసే గుణం అలవర్చుకోవాలని సీనియర్ దైవజనులు వెంకటంపల్లి సురేష్ వివరించారు రోజువారీగా మనం కలిగి ఉన్న ఊపిరిని దేవుడు అనుగ్రహించాడని భక్తి మార్గంలో సాగుతూ పొరుగు వారికి అత్యవసర సమయంలో మేలు కరమైన సహకారాలు అందించాలని సంఘ నాయకులు గోనబావి జాన్ పాల్ తెలియజేశారు ప్రత్యేక తెలంగాణ సువార్త బృందం ద్వారా వచ్చిన సేవకులందరికీ కుటుంబాలలో శాంతి సమాధానం పొలాల్లో లాభసాటి అందరి జీవితాల్లో గొప్ప అభివృద్ధిని దేవుడు సహాయం చేయాలని ప్రత్యేక ప్రార్థనలు చేయడమైనది ప్రత్యేకగీతములతో గ్రామంలో శాంతి సువార్తను ప్రతివారికిని నెమ్మది కలిగి చేయాలని ప్రార్థించడం అయింది ఈ కార్యక్రమంలో తెలంగాణ గాస్పల బృందం ఎం జాన్ పాల్ మార్క్ ఆనందరాజు క్రిస్టఫర్ అనిల్ పుష్ప మరియు సేవకులు బెలెడు మోషే జేమ్స్ జాన్సన్ ఇస్సాకు చందు జోసెఫ్ మరియు సువార్తమ్మ ఫిలిప్పీ లేటు కుటుంబ సభ్యులు అనేకులు పాల్గొన్నారు

## పార్టీ కార్యాలయం కొరకు స్థలం కేటాయించండి

కుందుర్పి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త



తహశీల్దార్ కు అర్జీ ఇస్తున్న టిడీపీ నాయకులు

కుందుర్పి మండలం మలయనూరు పంచాయతీ పరిధిలో టిడిపి పార్టీ కార్యాలయం నిర్మాణం కొరకు స్థలం కేటాయించాలని మంగళవారం టిడిపి నాయకులు తహశీల్దార్ ఓబులేష్ కు వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ పరిధిలో మలయనూరు ,సిని మార్జిన పల్లి, నాగేపల్లి, కొల్లరేటి, శీగలపల్లి ఐదు గ్రామాలు ఉండడం వలన పార్టీ సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందిగా ఉందని అర్జీలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గుంతకల్లు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిని లీనా వసుంధర అన్నారు. మంగళవారం మండలంలోని ధోనిముక్కల, నెలగొండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఈఓలు అనిత, నాగరాజు, విహెచ్ఎ దివ్యవాణి, ఏఈఓ శివరాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆరోగ్య వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

సోమందేపల్లి సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



కేక్ కట్ చేస్తున్న యాదవ సంఘం నాయకులు

మండల కేంద్రంలోని శ్రీ వేణుమాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ సంఘం ఆధ్వర్యంలో హిందూపూర్ రోడ్డు నక్కల గుట్ట సమీపంలో శ్రీకృష్ణుడి గుడి, కళ్యాణ మండప నిర్మాణ స్థల ప్రాంగణంలో ఆరోగ్య వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది ఈ సందర్భంగా యాదవ సంఘం మండల అధ్యక్షులు జి మహేష్ యాదవ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి యాదవుల ముద్దుబిడ్డ మంత్రి సత్య కుమార్ యాదవ్ 53 సంవత్సరాలు పూర్తి చేసుకుని 54 వ సంవత్సరంలో అడుగుపెడుతున్న బిసి నాయకుడు కూటమి ప్రభుత్వానికి పట్టుకొమ్మలా అందరి అభిమానులను చొరగున్న నాయకుడిగా ముందుకు సాగుతున్న సత్య కుమార్ యాదవ్ ఎన్నో పదవులను అవరోదించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలియజేస్తూ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టుకుని ఆయు రారోగ్యాలతో ఉండాలని ప్రజలకు మరింత సేవలు చేసే శక్తి సామర్థ్యాలు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటూ జన్మదిన వేడుకలను తెలియజేశారు శ్రీ వేణుమాధవ్ యాదవ వెల్ఫేర్ సొసైటీ సంగం మండల కమిటీ నాయకులు జి మహేష్ యాదవ్, గోపాల్ యాదవ్ , జి పి నరసింహులు యాదవ్, రాజగోపాల్ యాదవ్, నాగరాజ్ యాదవ్, డీలర్ రమేష్ యాదవ్, మంజు యాదవ్, ఓబులేష్ యాదవ్, ఉపేంద్ర యాదవ్, రవి యాదవ్, శంకర్ , భక్తర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## వాహన మిత్ర అమలుపై ఆటో యజమానుల హర్షం.

ప్రభుత్వానికి కృతజ్ఞతగా ముఖ్యమంత్రి ఫోటోకు పాలాభిషేకం.

రాయదుర్గం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

వాహన మిత్ర ద్వారా ఆటో యజమానులకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల టి ఎన్ టి యు సి వర్షం వ్యక్తం చేసింది. తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో రాయదుర్గం పట్టణంలో మంగళవారం ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రుల ఫోటోలకు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాలాభిషేకం చేశారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీ అనంతరం వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ బాబు ఫోటోలకు పాలాభిషేకం చేశారు. ఆటో యజమానుల సమస్యలు గుర్తించిన ప్రభుత్వం ఆర్థిక చేయూత ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి తాము ఎప్పుడు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, కడ్డిపూడి మహబూబ్ బాషా,ఆటో వెంకటేశులు, ఆటో మల్లేష్, ధనార్జన,వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఆటలో మెరిసి ఉద్యోగం సాధించిన యువతి

మేనమామల ప్రోత్సహంతో ప్రభుత్వ ఉద్యోగం

వజ్రకరూర్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



మేనమామలతో వినీత

చదువుకోకుండా ఎప్పుడూ ఆటలేని అది సాధారణంగా పిల్లలను పెద్దలు దండిస్తూ ఉంటారు కానీ ఆ యువతీకి మాత్రం చిన్నప్పుడు స్కూల్లో ఆడిన ఆటనే నేడు ప్రభుత్వఉద్యోగం తెచ్చి పెట్టింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని గడే హోతూరు గ్రామానికి చెందిన వినిత అనే యువతి రెండవ సంవత్సరంలోనే తండ్రిని 15 సంవత్సరాలప్పుడు తల్లిని అమ్మమ్మ తాతయ్యా ల ఆదరణ మేనమామ లు తిమ్మప్ప, సిద్ధప్పల సహకారంతో చదువులు కొనసాగిస్తూ స్కూలు పాఠశాలలో నిర్వహించే ఆటలో పాల్గొంటూ ప్రతిభను చాటుతూ ఉండేది. 8వ తరగతి చదువుతున్నప్పుడు రాష్ట్రస్థాయి కోకో పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. జాతీయ స్థాయిలో 13 సార్లకు పైగా ఖోఖో పోటీలలో పాల్గొంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ 2025లో ఎస్ జి టి గా ఉద్యోగం సాధించింది. ఈనెల 19 న విజయవాడలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకోనున్నట్లు ఆమె తెలిపారు. తల్లిదండ్రులు మృతి చెందిన మేనమామల ఆదరణ, ఆప్యాయతలు, పిఈటి ప్రభాకర్ సహకారంతో ఉద్యోగం సాధించినట్లు ఆమె తెలిపారు.

## కూటమి పాలనలో ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యత.

శాసన సభ్యులు కాలవ శ్రీనివాసులు.

రాయదుర్గం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజలకు ,ముఖ్యంగా మహిళలకు కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత కల్పిస్తోందని శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. రాయదుర్గం పట్టణంలోని తొమ్మిదవ వార్డులో మంగళవారం జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రంతో పాటు రాయదుర్గం నియోజక వర్గానికి తప్పక ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. స్వార్థపూరిత నేతల చేతుల్లో పాలన ఎలా ఉంటుందో..? గత వైకాపా పాలకులు గుర్తు చేశారన్నారు. కర్ణాటక మద్యాన్ని తీసుకొచ్చి మన రాయదుర్గం ప్రాంతంలో విక్రయిస్తూ పిల్లల భవిష్యత్తును నాశనం చేశారని గుర్తు చేశారు. ప్రజల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యాన్ని సహితం పొరుగు రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నారని ధ్వజమెత్తారు. శాంతి భద్రతలు పూర్తిగా గాలికి వదిలేసి ఏకపక్షంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల దివాలా తీయించి జేబులు నింపుకొన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా చంద్రబాబు పాలనలోనే కూటమి ప్రభుత్వం పేదరికంలేని సమాజాన్ని చూడాలని కలలు కంటోందన్నారు. సహాయం చేయగలిగే స్థాయిలో ఉన్నవారు పేదరికంలో మగ్గుతున్న వారికి కాస్త సహాయం చేయాలన్న సంకల్పంతోనే పి ఫోర్ విధానాన్ని ప్రారంభించామన్నారు. మన వద్ద ఉన్నది లేనివారికి పంచడంలో ఉన్న తృప్తి మరి ఎందులోనూ రాదని సూచించారు. సహాయం పొందినవారు ఆ విషయాన్ని ఎప్పటికీ మరచిపోరన్నారు. తాను ఎంపీగా పనిచేసినప్పుడు కొందరు ఉద్యోగులకు సాయం చేస్తే... ఆ తర్వాత తాను ఎప్పుడు వారికి కనిపించినా, ఆ విషయాన్ని గుర్తు చేస్తూ ఆనందిస్తారని ఉదాహరించారు. చంద్రబాబు పాలనలో సమాజంలో మహిళలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వడం జరుగుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులలో కుటుంబ యజమానిగా తల్లినే పేర్కొనడం జరిగిందన్నారు. అలాగే అనేక ప్రభుత్వ పథకాల్లో మహిళలకు తొలి ప్రధాన కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. క్యూఆర్ కోడ్ తో రూపొందించిన ఈ స్మార్ట్ కార్డులలో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు నమోదుచేసి ఉంటాయన్నారు. అంతేకాకుండా ఎప్పుడు..? ఎక్కడ..? ఆ రేషన్ కార్డు ద్వారా ఏ ఏ సరుకులు ఎంత మొత్తంలో తీసుకున్నారో కూడా నమోదయి ఉంటుందన్నారు. కార్డు స్వైప్ చేయగానే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కార్డుగా దీన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా 97,707 రేషన్ కార్డు దారులకు ప్రతినెల రేషన్ పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ వివరించారు.

## జనరల్ హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికుల మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలి

- సూపర్డెంట్ కార్యాలయం వద్ద ధర్నా



వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ కార్మికుల ధర్నా

అనంతపురం కలెక్టరేట్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపర్డెంట్ కార్యాలయం వద్ద మంగళవారం పారిశుద్ధ్య కార్మికులు మూడు నెలల బకాయి వేతనాల కోసం సూపర్డెంట్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సూపర్డెంట్ సుబ్రహ్మణ్యం వినతిపత్రం అందజేశారు . సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ గవర్నమెంట్ హాస్పిటల్,సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సీపర్స్, సెక్యూరిటీ గార్డ్ సమస్యల మీద అనేక దఫాలుగా జిల్లా కలెక్టర్ సూపరింటెంట్ దృష్టికి అనేక సంవత్సరాలుగా తీసుకువెళ్లిన సమస్యలు పరిష్కారం కాలేదని గత నెలలో సమ్మె చేయాలని కార్మికులు నిర్ణయించుకున్నప్పుడు యూనియన్ జోక్యం చేసుకుని వైద్యం కోసం వస్తున్న నిరుపేదలైన ప్రజలను దృష్టిలో పెట్టుకొని అధికారులతో చర్చించి మా సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి సంవత్సరం రెండుసార్లు యూనిఫామ్, బ్లౌజులు, మాస్కులు తక్షణమే అనేక జబ్బులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న అలాంటి ప్రజల కోసం తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా వారు విధులు నిర్వహిస్తుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం ఏంటని ఎద్దేవా చేశారు సమస్యలు పరిష్కారం నిరవధిక సమ్మెకు చేయాల్సి పరిస్థితి వస్తుందని సూపర్డెంట్ గారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం నాగమణి నగర కార్యదర్శి ముత్తుజ, నల్లమ్మ రేఖ, ఉమామహేశ్వరి, పుష్ప, సరస్వతి కార్మికులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 19న ధన్వంతరి జయంతోత్సవం

- నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అక్టోబర్ 19 ధన్వంతరి జయంతోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం జయమానెమ్మ కళ్యాణ మండపంలో 10, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా అధ్యక్షులు వెంకటరంగయ్య, గౌరవాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారులు శివప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్టీసీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు కరపత్రాలను ఆవిష్కరించారు. పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 480, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు 520, ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ విద్యార్థులు 850, ప్రైవేట్ విద్యార్థులు 900 మార్కులతో పైబడి ఉత్తీర్ణత సాధించిన వారు మార్క్ లిస్ట్ క్యాస్ట్ సర్టిఫికెట్ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి, ఎం.శ్రీనివాసులు ఆర్టీసీ, డోర్ నెంబర్ 181406 వేణుగోపాల్ నగర్ ఓల్డ్ టౌన్ అనంతపురం పిన్ కోడ్ 515005, సెల్ నెంబర్ 9441222874 చిరునామాకు ఈనెల 30వ తేదీ లోపు పంపించాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు దివాకర్ ఎంపీడీవో, హనుమేష్, రమణ, శివయ్య, ఎస్కేయూ మురళి, బీసీ రామ్మోహన్, నరసింహులు, సత్యనారాయణమ్మ, ఉషాదేవి, వివేకానంద, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్టిసి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జెవివి రాష్ట్ర కమిటీకి ఎంపిక..

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



డా.పి.ప్రసూన



డా.కె.వీర్రాజు

ఈనెల 13, 14న విజయనగరంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలో అనంతపురం జిల్లా నుంచి రాష్ట్ర కమిటీ సభ్యులుగా జెవివి జిల్లా గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు ఎంపికైనట్లు మాజీ రాష్ట్ర అధ్యక్షులు ప్రస్తుత రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్ మంగళవారం సంగమేష్ నగర్ లోని జెవివి కార్యాలయంలో తెలియజేశారు. వీరుతోపాటుగా రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్‌గా సాకే భాస్కర్, విద్యాసబ్ కమిటీ సభ్యులుగా ఎస్.మహమ్మద్ జిలాన్, వైద్య విభాగం సబ్ కమిటీ కో కన్వీనర్‌గా కె.లక్ష్మీనారాయణ, మ్యాజిక్ సబ్ కమిటీ సభ్యులుగా ఎం ప్రసాద్, సమతా సబ్ కమిటీ సభ్యులుగా కె.నాగరత్న ఎన్నికయ్యారని ఆయన అన్నారు "మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును" అని చెప్పిన గురుజాడ అప్పారావు నడయాడిన నేలలో రాష్ట్ర మహాసభ ఎంతో ఉత్సాహంగా జరిగిందని, రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి ప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారని అన్నారు.

ఈ మహాసభలో రాబోవు రెండు సంవత్సరాల కాలంలో జెవివి చేపట్టబోయే భవిష్యత్ కర్తవ్యాలను నిర్ణయించుకోవడం జరిగిందని,వాటిని నూతన నాయకత్వం అమలు పరుస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## ఈ పంట నమోదు 30 లోపు పూర్తి చేయాలి



సమావేశం నిర్వహించిన వ్యవసాయ అధికారి సోముశేఖర్..

గార్లదిన్నె సెప్టెంబర్ 16,ప్రభాతవార్త

ఈ పంట నమోదు(క్రాప్ బుకింగ్) ఈ నెల ఆఖరి 30వ తేదీలోపు పూర్తి చేయాలని మండల వ్యవసాయఅధికారి సోముశేఖర్ రైతుసేవా కేంద్ర సిబ్బందిని ఆదేశించారు...మంగళవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా సోముశేఖర్ మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, పచ్చిరొట్ట ఎరువులు వాడకం, జీవన ఎరువులయిన అజోల్లా, అజోస్పైరిల్లం తదితర ఎరువుల వాడకం పై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.. అలాగే పీఎంకిసాన్ మరియు అన్నదాత సుఖీభవ పథకాలలో ఎన్పిసిఐ ఇనాక్టివ్ ఉన్న రైతులకు ఎన్పిసిఐ చేయించుకోవాలని రైతులకు తెలియజేయాలని తెలిపారు.అలాగే పంటకోత ప్రయోగాల గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రీవాణి, హరి మరియు రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు...

## మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు

- ఎల్‌డిఎం చైర్మన్ నరేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డిఎం చైర్మన్ నరేష్‌రెడ్డి



బ్యాంకర్ల సమావేశానికి హాజరైన అధికారులు

శింగనమల, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

నియోజకవర్గ వ్యాప్తంగా మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని ఎల్‌డిఎం చైర్మన్ నరేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌డిఎం చైర్మన్ నరేష్‌రెడ్డి, నాబార్డు డిడిఎం, రూట్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, డిఆర్‌డిఎ ఏపిటి రాధారాణి, రాజ్యలక్ష్మి, సుభద్ర, మంజుళ, నియోజకవర్గ పరిధిలోని అన్ని బ్యాంకర్ల నుంచి అధికారులు, ఐకెపిల నుంచి సిసిలు, శింగనమల ఏపిఎం ఈశ్వరయ్య తదితరులు హాజరయ్యారు. గతంలో ప్రతి మూడు నెలలకోసారి జిల్లాకేంద్రంలో నిర్వహించే ఈ సమావేశాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి సారిగా నియోజకవర్గ కేంద్రం శింగనమలలో నిర్వహించారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



స్మార్ట్ కార్డుల పంపిణీ నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శీనప్ప ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని అరవకూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం పండుగలా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు కురుగుంట ప్రసాద్,టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీరాములు, పుట్టా నరేష్, బూత్ కన్వీనర్ సంగమేష్, కే.ఈశ్వరయ్య, గొర్ల ప్రసాద్, సంగప్ప, శ్రీనివాసులు, డీలర్ విజయ్, శేఖర్, ఎస్ఎంసి చైర్మన్ పెద్దన్న, దుబ్బర ఓబులేసు, వి.సుబ్బ రాయుడు, చాకలి సుబ్బయ్య, చెన్నయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

## పలు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని కొర్రకోడు, చోళసముద్రం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి మరియు రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించడం జరిగింది.రైతుల సమావేశంలో చర్చించిన విషయాలు ఎరువుల లభ్యత వినియోగం గూర్చి రైతులకు తెలియజేశారు. మండల వ్యాప్తంగా రైతులకు కావలసిన ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళికను గ్రామస్థాయిలో నివేదిక తీసుకోవడం జరిగింది. ఈ పంటకు సంబంధించి డి పట్టా, చుక్కల భూములు వివరాలు వస్తున్నాయి కావున రైతులు ముప్పైవ తేదీ లోపల ఈ పంట నమోదు (ఈ క్రాప్ బుకింగ్) చేసుకోవాలని రైతులకు తెలియజేశారు.

## చెత్త సేకరణను తనిఖీ చేసిన ఎంపిడిఓ



ఇంటింటి చెత్త సేకరణ గురించి అడిగి తెలుసు కుంటున్న ఎంపిడిఓ, ఈఓఆర్డిలు

గార్లదిన్నె సెప్టెంబర్ 16ప్రభాతవార్త

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మండల కేంద్రంలోని పెనకచర్ల గ్రామంలో మంగళవారం ఇంటింటి చెత్త సేకరణ ను తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా ఎంపిడిఓ యోగనంద రెడ్డి మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ పటిష్టంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి కి సూచించారు..డ్రైనేజీ క్లీనింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, డ్రైనేజీలకు మందు స్ప్రే గురించి అడిగి తెలుసు కున్నారు.. ప్రతి ఒక్కరు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో బాధ్యతగా భావించాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి దామోదరమ్మ, పెనకచర్ల పంచాయతీ కార్యదర్శి ఖాదర్ వలిలు పాల్గొన్నారు.

## గుమ్మేపల్లిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

- టిడిపి జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి



స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న డేగల కృష్ణమూర్తి

శింగనమల, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామంలో మంగళవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయితీరాజ్ ఛాంబర్ కార్యనిర్వహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, స్థానిక నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ స్మార్ట్‌కార్డుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని గతంలో మాదిరిగా రేషన్‌కార్డులపై ఏ ఒక్క నాయకుడి ఫోటోలు లేకుండా పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సచివలయ సిబ్బంది కళ్యాణి, డీలర్ డేగల శ్రీనివాసులు, టిడిపి నాయకులు లక్ష్మయ్య, కురుబ ఓబుళపతి, ఓబులేసు, కురుబ ఎరిస్వామి, నారాయణస్వామి, వద్దే నాగాంజి, రమణప్ప, బెస్త అమర్‌నాథ్, బోయ పుల్లయ్య, నాగేంద్ర, లక్ష్మీనాథ్, గోవర్దన్‌రెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర తెలుగు సాంస్కృతిక అకాడమి చైర్మన్‌కు ఘన సన్మానం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



రాష్ట్ర తెలుగు సాంస్కృతిక అకాడమి చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర తెలుగు సాంస్కృతిక అకడమి చైర్మన్‌గా ఆర్.డి.విల్సన్ ప్రమాణ స్వీకారం మహోత్సవంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరు పోగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు మాట్లాడుతూ.. ఆర్‌డి విల్సన్‌కి బిజెపి అధ్యక్షులు గుర్తించి చైర్మన్ పదవిని ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాష సాంస్కృతి రచయితలు గుర్తించి అన్ని లైబ్రరీలో సదుపాయాలు కల్పించే విధంగా చొరవ చూపాలని విన్నవించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిన్న పెద్దన్న, సత్యం, కదిరప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ



జిల్లా వ్యాప్తంగా వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

అనంతపురం కలెక్టరేట్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాలలోని కూడళ్ళు... జాతీయ రాష్ట్రీయ రహదారులపై ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాలలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేసిన పోలీసులు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ లకు దూరంగా ఉండాలని సూచనలు చేసిన ఆయా పోలీసులు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు.రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసుల చర్యలు తీసుకుంటా ఉన్నారు. మైనర్ల వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కావున తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తెలియజేసినపోలీసులు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డెఫెక్టివ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ మొదలైన ఉల్లంఘనలకు జరిమానాలు విధించాలని ఎస్పీ ఆదేశించారు

## రైతు గుండెల్లో మహానేత వైయస్సార్ చిరస్మరణీయం

- మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజానీకం రైతు గుండెల్లో దివంగతనేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి నిలిచిపోయారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంతరెడ్డి అన్నారు.మంగళవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగ వారు మాట్లడుతూ మహానేత వైస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకోసం ఉచిత విద్యుత్,ఎన్నో ప్రాజెక్టులు నిర్మించి రైతులకు సాగునీరు అందించిన ఘనుడు. ఆయన భౌతికంగా ప్రజలకు దూరమైన ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమాలు ఇప్పటికి ఉన్నాయన్నారు.ఆ మహానాయకుడు సేవలకు జ్ఞాపకార్థం 2009 నవంబర్ లో బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించి సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు రైతుల ఆమోదంతో సొసైటీ కార్యాలయానికి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకార సంఘం సొసైటీ అని పేరు పెట్టి తీర్మానించడం జరిగింది.కూటమి ప్రభుత్వం అధికాంలోకి వచ్చిన తరువాత రైతులకు చేసింది ఏమిలేదు,రైతులకు కనీసం యూరియాకూడ అందించలేకపోవడం సిగ్గుచేటు అన్నారు.మహానేత వైయస్సార్ పేరును అధికార బలంతో గోడలమీద చెరపగలరేమో, రైతు గుండెల్లో నుంచి చెరిపి వేయలేరన్నారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న విధానాలను రాష్ట్ర ప్రజలందరు గమనిస్తున్నారు.వారికి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో గువ్వల శ్రీకాంతురెడ్డి తోపాటు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వరికూటి కాటమయ్య,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు పూల రంగనాథ్,చేనేత విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల భాస్కర్,మండల ప్రధాన కార్యదర్శి జగదీష్‌రెడ్డి,ఎగ్జికూటివ్ మెంబర్ రఘు,సత్తిరెడ్డి తదితిరులు పాల్గొన్నారు.

## మహిళా విద్యకు ఆధ్యురాలు సావిత్రిభాయి పూలే

- విగ్రహావిష్కరణలో ప్రజా ప్రతినిధులు



సావిత్రి భాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు అధికారులు

అనంతపురం సిటీ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

దేశంలోనే మహిళా విద్యకు ఆధ్యురాలు సావిత్రిభాయి పూలే అని వక్తలు కొనియాడారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలో జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ ఏర్పాటు చేయించిన సావిత్రిభాయి పూలే విగ్రహావిష్కరణలో మంగళవారం నిర్వహించారు. జడ్పి ప్రాంగణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం పక్కనే సావిత్రి భాయి పూలే విగ్రహాన్ని జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ ఏర్పాటు చేయించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జాయింట్ కలెక్టర్లు శివ్‌నారాయణశర్మ, అభిషేక్‌కుమార్‌లతో కలిసి జడ్పి చైర్మన్ బోయగిరిజమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే పీడిత వర్గ స్త్రీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. జ్యోతిభా పూలే అడుగు జాడల్లో సావిత్రి భాయి పూలే సంఘ సంస్కర్తగా అనేక సాంఘీక అసమానతలపై పోరాడారని కొనియాడారు. సావిత్రిభాయి పూలే విగ్రహ ఏర్పాటు అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ఎంపి అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. దేశంలో ఆడ పిల్లల చదువు, అభివృద్ధి గురించి మాట్లాడాలంటే సావిత్రి భాయి పూలే గుర్తుకు వస్తారని కొనియాడారు. మానవ నిర్మిత అడ్డుగోడలను ఎదురించి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రి భాయి పూలే నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సావిత్రి భాయి పూలే సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఒ శివశంకర్, డిప్యూటీ సీఇఒ వెంకట సుబ్బయ్యతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ ఇంటి గుత్తలన్నీ వసూలు చేయాలి

- పంచాయతీ సిబ్బందికి తెలిపిన గ్రేడ్ I కార్యదర్శి ప్రవీణ్ బాబు.



సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ బాబు.

అనంతపురంరూరల్,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం ఏ నారాయణపురంపంచాయతీలో పెండింగ్ ఉన్న ఇంటి గుత్తులన్నీ ఈనెల 25 లోపల వసూలు చేయాలని పంచాయతీ సిబ్బందికి గ్రేడ్ 1 కార్యదర్శి ప్రవీణ్ బాబు తెలియజేశారు.పంచాయతీలో ఇంకా ఇంటి గుత్తలు ఎంత పెండింగ్ ఉన్నాయని ఇంటి గుత్తలు వసూలు చేసే సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కమీషనర్, డిపిఒ పెండింగ్ ఇంటి గుత్తుల వసూల్లో చాలా సీరియస్ గా ఉన్నారని ఈనెల 25 లోపు పెండింగ్ ఇంటి గుత్తులన్నీ వసూలు చేయాలని ఆదేశించడం జరిగిందని వారి ఆదేశాల తప్పకుండా మీరంతా పెండింగ్లో ఉన్న ఇంటి గుత్తులన్నీ 25 లోపల వసూలు చేయాలని ఇంటి గుప్తల వసూలు చేసే సిబ్బందికి తెలియజేయడంతో వారు తప్పకుండా ఈ నెల 25 లోపల పెండింగ్ లో ఉన్న ఇంటి గుత్తలన్నీ వసూలు చేస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. గ్రామ ప్రజలందరు ఇంటి గుత్తలు, నీటి పన్ను లు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ బాబు ప్రజలను కోరారు.

## తడి పొడి చెత్త వేరువేరుగా ఇచ్చి సహకరించండి

డి ఎల్ పీ ఓ, ఎంపీడీవో.

అనంతపురం రూరల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

అనంత రూరల్ మండలం చిన్నంపల్లి గ్రామపంచాయతీలో నివసించే ప్రజలందరూ తడి పొడి చెత్త వేరువేరుగా ఇచ్చి సహకరించాలని డి ఎల్ పీ ఓ విజయ్ కుమార్, ఎంపీడీవో దివాకర్ కోరారు. చిన్నంపల్లి గ్రామంలో పంచాయతీ కార్మికులు చేపడుతున్న ఇంటింటి చెత్త సేకరణ పనులను డి యల్ పీ ఓ విజయ్ కుమార్, ఎంపీడీఓ దివాకర్, మంగళ వారం ఉదయాన్నే వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నివసించే ప్రతి ఇంటి నుంచి పంచాయతీ కార్మికులు ప్రతిరోజు వారి ఇంటి వద్దకు వెళ్లి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రానికి తరలించి అందులో నిలువ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం డిఎల్పిఓ విజయ్ కుమార్, సర్పంచ్ శివశంకర్ తో కలిసి చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, కార్యదర్శి శరన్ కుమార్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా పంపిణీ

అనంతపురంరూరల్,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం ఇటుకలపల్లి, మనీల గ్రామాలలోని రైతులకు యూరియా పంపిణీ చేశామని వ్యవసాయ శాఖ మండల విస్తరణ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సంయుక్త కలెక్టర్, జెడిఎ, ఏ డి ఏ, ఏవో ఆదేశాల మేరకు మంగళవారం ఇటుకులపల్లి గ్రామంలో ని రైతులకు 140 బస్తాలు, అదేవిధంగా మనీల గ్రామంలోని రైతులకు 140 బస్తాల యూరియాను పంపిణీ చేయడం జరిగింది అన్నారు. యూరియా అవసరమైన రైతులందరికీ పంపిణీ చేశామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మన్నీల గ్రామ సర్పంచ్ త్రిలోక్ నాయుడు చల్ల నాయుడు షేక్షావలి నాయుడు, నాగరాజు నాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు అలాగే ఇటుకలపల్లి గ్రామంలో మాధవయ్య,రాజేంద్ర,చిన్నకృష్ణ, చిన్న రాజు వెంకట్ రాముడు టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మురళీకృష్ణ రైతు సేవా కేంద్ర సిబ్బంది జయ చంద్రారెడ్డి, నికిత,అపర్ణ అపర్ణ,మల్లికార్జున,భరత్ కుమార్ నలినాక్షి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ స్మార్ట్ కార్డ్ పంపిణీ



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నార్పల సెప్టెంబర్ 16, ప్రభాతవార్త

మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు శింగనమల శాసన సభ్యురాలు బండారు శ్రావణి శ్రీ గారి ఆదేశాల ప్రకారం రేషన్ స్మార్ట్ కార్డ్ ల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ అరుణకుమారి సి ఎస్ డి టి చంద్రకళ వీఆర్వో శివరాం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆకుల విజయకుమార్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకుల బాబు మాట్లాడుతూ స్మార్ట్ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని గతంలో మాదిరి రేషన్ కార్డ్ ల మీద ఏ ఒక్క నాయకుడు ఫోటోలు లేకుండా పంపిణీ చేయడం హర్షనీయమనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో లేనివారికి కూడా కొత్తగా పెళ్లయిన వారికి నూతనంగా కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకుల అరుణ, తెలుగుదేశం పార్టీ నాయకులు మదమంచి ప్రతాప్ చౌదరి, రేషన్ డీలర్లు రామానాయుడు, సుదర్శన్, మాజీ కోఆప్షన్ మెంబర్ సాలెహా, మాజీ ఎంపిటిసి వేణుగోపాల్, ప్రతాప్ ఆచారి,బాలుర పాఠశాల విద్య కమిటీ చైర్మన్ ఆలమూరు ప్రసాద్, బాలనాగి నరేష్, పొన్నతోట వనజాక్షి, రామకృష్ణ,కుల్లాయప్ప,మురళి మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తరేషన్ కార్డులు పంపిణీ

శింగనమల, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్మార్ట్ రేషన్‌కార్డులను మంగళవారం శింగనమల మండల కేంద్రంలో టిడిపి నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసుల్ చంద్రమోహన్, విఆర్ఓ తాతయ్య, డిజిటల్ అసిస్టెంట్ సురేష్, డీలర్ సత్యనారాయణ, చిన్న అక్బర్, జడేజా, నరేష్, టిల్లు, రాముడు, పూజా తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

## గుండెపోటుతోనే రామకృష్ణనాయక్ మృతి

**- పోలీసులు హింసించారు అన్న మాటలలో ఎటువంటి నిజం లేదు**

**- అనంతపురం రూరల్ డిఎస్పీ టి.వెంకటేషులు**



సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం రూరల్ డిఎస్పీ టి.వెంకటేషులు

శింగనమల, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని నాగలగుడ్డం తాండాకు చెందిన రామకృష్ణనాయక్ మృతిపై మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనంత రూరల్ డిఎస్పీ టి.వెంకటేషులు పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేది రాత్రి 9 గంటల ప్రాంతంలో శింగనమల ఎస్ఐ విజయ్‌కుమార్‌కు మండల పరిధిలోని నాగలగుడ్డం తాండా గ్రామంలో జూదం గురించి సమాచారం అందడంతో వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో గ్రామాన్ని సందర్శించి రోహిత్‌నాయక్, భాస్కర్‌నాయక్, గోపాల్‌నాయక్, సురేష్‌నాయక్, రామకృష్ణనాయక్, పెద్ద కుష్యనాయక్‌లు నాగలగుడ్డం తాండాకు చెందిన వారు జూదం (మంగపట్ట) ఆడుతూ ఉండగా వారి వద్ద నుంచి 7,650 నగదు, 52 పేకలను స్వాధీనం చేసుకున్నారని, గ్రామ పెద్దలు సుదర్శన్‌నాయక్, శ్రీనివాసులు నాయక్, తిరుపాల్‌నాయక్‌ల జోక్యంతో ఎస్ఐ వారిని మరుసటి రోజు ఉదయం(సోమవారం) శింగనమల పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని తెలిపారు. 15వ తేది ఉదయం 9 గంటల ప్రాంతంలో 35 సంవత్సరాలు వయస్సు గల ఎం.రామకృష్ణనాయక్, పెద్దకుషన్ నాయక్‌లు చాతి నొప్పితో బాధపడుతున్నారని ఫిర్యాదు చేశారు. అతని కుటుంబ సభ్యులు అతని చికిత్స కోసం గార్లదిన్నె పిహెచ్‌సికి తరలించారు. పిహెచ్‌సి వైద్యుని సలహా మేరకు మెరుగైన చికిత్స కొరకు శింగనమలలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రెఫర్ చేశారని, ఉదయం 10:30 గంటలకు కుటుంబ సభ్యులు అతన్ని తీసుకొచ్చి సిహెచ్‌సిలో చేర్చారు. అక్కడి డ్యూటీ డాక్టర్ చికిత్స ప్రారంభించారు. ఉదయం 10:50 గంటలకు రోగికి తీవ్రంగా చాతినొప్పి, గుండెపోటు వచ్చిందని, ఉదయం 11:40 గంటలకు డాక్టర్ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ రోగి రామకృష్ణనాయక్ స్పృహ కోల్పోయారు. ఇసిజి తీసుకున్న తర్వాత వైద్యులు అతని మరణాన్ని నిర్ధారించారని, కొంత మంది వ్యక్తులు ఆరోపించినట్లుగా ఐదుగురు నింధితులను 14వ తేది రాత్రి లేదా 15వ తేది ఉదయం పోలీసులు హింసించారని వస్తున్న వార్తలలో ఎటువంటి నిజం లేదని తెలియజేస్తున్నామని, పోలీస్‌స్టేషన్‌లోని సిసి టివి పుటేజీలను కూడా మేము పరిశీలించినట్లు తెలిపారు. గుండెపోటుతోనే రామకృష్ణనాయక్ మృతి చెందినట్లు డిఎస్పీ టి.వెంకటేషులు స్పష్టం చేశారు.

## సిమెంట్ రోడ్డుకు భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డుకు మంగళవారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ భూమిపూజ నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెలే ఏయ మాట్లాడుతూ.. గత వైసిపి పాలనలో మున్సిపాలిటీల అభజవృద్ధి, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన తయారైందన్నారు. కనీసం సిమెంట్ రోడ్లు కూడా వేసుకోలేని దుస్థితి ఆ ప్రభుత్వంలో ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక లోటు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని పెద్ద ఎత్తున ప్రవేశ పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాదున్నీసా బాహుద్దీన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పాలవల పవన్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, వార్డు కౌన్సిలర్ హరిత, టిడిపి నాయకులు, వాల్మీకి విదా య సంస్థల చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల సద్వినియోగం చేసుకోండి

**-పంపిణీ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డే వెంకటేశులు**



స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు కుంచెపు వడ్డే వెంకటేష్ తదితరులు

అనంతపురం సెప్టెంబరు 16 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు ఇంటింటికి ఉచితంగా పంపిణీ చేస్తోందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు పిలుపునిచ్చాడు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా డివిజన్లలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కార్డులను పంపిణీ చేయాలన్న మేరకు మంగళవారం ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు వడ్డే సిమెంటు పోలన్న, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కడియాల కొండన్నతో పాటు 8,9 డివిజన్ల ఇన్‌చార్జులు సుంకన్న, కుళ్లాయప్ప, రామాంజి, ఫణీంద్ర, హాజీపీరా ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటింటికి తిరిగి సంబంధిత అధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేశారు.

## 23న లక్ష్మినరసింహస్వామి ఆలయంలో బహిరంగ వేలాలు

**-ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి**

ఉరవకొండ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు తలనీలాలు సేకరించుకొను హక్కు, పా త్ర సామానులు బాడుగకు ఇచ్చుకొను హక్కు, కలగలపు బియ్యం బేడలను ఏడాదిపాటు అమ్ముకొను హక్కులకై బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి మంగళవారం తెలిపారు. మధ్యాన్నం ఒంటి గంట నుంచి ఆలయనికి చెందిన ఆమిద్యాల, మోపిడి, చిన్నముష్టూరు, పెద్దముష్టూరు కోనాపురం, రాచర్ల తండా, మూలగిరిపల్లి గ్రామాల్లోని భూములను 3 సంవత్సరాలకు కౌలుకు ఇవ్వడంకోసం బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన పాటదారులు ఆధార్ కార్డు నకలు తీసుకొని రావాలని ఈవో సూచించారు.

## నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన ప్రతి ఆలయాన్నీ సందర్శించేలా పర్యాటకాభివృద్ధి

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



స్వామివారి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే

రాయదుర్గం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాలను కలుపుతూ ఓ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. రాయదుర్గం పట్టణంలో మంగళవారం జరిగిన దశభుజ గణపతి ఆలయ కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భక్తుల ఆశీస్సులు, సహకారాలతో దశభుజ గణపతి పురాతన ఆలయాన్ని కమిటీ సభ్యులు అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతుండటం ఆనందం కలిగిస్తోందన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కర్ణాటక రాష్ట్రానికి పోరుగునున్న రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో ప్రసిద్ధి చెందిన అనేక పురాతన ఆలయాలు ఉన్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా నేమకల్లు, మురడి ఆంజనేయస్వామి దేవాలయాలతో పాటు రాయదుర్గం పట్టణంలో దశభుజ గణపతి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, అలాగే నియోజకవర్గ పరిధిలో పశుపతినాథ టెంపుల్, కోదండ రామాలయం, శివాలయాలు పురాతన ఆలయాలుగా ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. వీటన్నింటినీ కలిపి ఒకేసారి సందర్శించుకునే వెసులుబాటు కలిగేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఇదివరకే నేమకల్లు ఆంజనేయస్వామి వెంకటేశ్వర స్వామి శివాలయానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అలాగే ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఇదివరకే నిధులు మంజూరు కాగా సాంకేతిక సమస్యల వలన విడుదల కాలేదన్నారు. ఈ సమస్యను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి వర్యులు, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు అందేలా చూస్తానన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది..!

**-మెరుగైన పీఆర్సీ, ఐఆర్ ప్రకటిస్తామని నమ్మబలికి పెడచెవిన పెడుతోంది**

**-'రణభేరి' ప్రచార జాతలో యుటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్**



యుటీఎఫ్ రణభేరి ప్రచార జాత ఉరవకొండ చేరిన దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న యుటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్

ఉరవకొండ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

తాము అధికారంలోకి రాగానే మెరుగైన పీఆర్సీ, ఐఆర్‌ను ప్రకటిస్తామని నమ్మబలికి ఉద్యోగ, ఉపాధ్యాయులతో లబ్ధిపొంది అధికారంలోకి వచ్చిన తరువాత న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని యుటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన విద్యారంగ సమస్యలు, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై యుటీఎఫ్ చేపట్టిన 'రణభేరి' ప్రచారజాత మంగళవారం గుంతకల్లు మీదుగా ఉరవకొండకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక యుటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యుటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మిరాజా, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి 15 నెలలు గడుస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని గత పీఆర్సీ బకాయిలు 30వేల కోట్లు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమీషన్ నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్ లేని పాఠశాల వ్యవస్థను తీసుకురావాలని, ఉపాధ్యాయులకు అవసరమైనటువంటి బోధనేతర పనులను తప్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. కాగా రణభేరి ప్రచార జాతలో భాగంగా ఉపాధ్యాయులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, సహాధ్యక్షులు రామప్పచౌదరి, కార్యదర్శులు శేఖర్, సంజీవ్‌కుమార్, రాజశేఖర్, కోశాధికారి రాఘవేంద్ర, పూర్వ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, మండల నాయకులు శ్రీనివాసులు, జయరాములు, రఘు, శ్రీనివాసగుప్త, బండయ్య, నాగరాజు, మధుబాబు, వన్నూరుస్వామి, ఇస్లాంభాషా, కొండపల్లి రాము, చంద్రమోహన్, ప్రసన్నకుమార్, శివ, శ్రీధర్, పోతప్ప, బాబు తదితరులు పాల్గొన్నారు

## స్వస్తి నారీ స్వశక్తి పరివార్ అభియాన్ నేటి నుండి ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వస్తి నారీ, స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నేటి నుండి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి స్టేట్. నోడల్ ఆఫీసర్ గా అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా డీఎంఎచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, ప్రోగ్రాం ఆఫీసర్లు,, డాక్టర్లు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఫై రోజా బేగం మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మహిళల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యఅతిథి నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా యాక్షన్ ప్లాన్ ప్రకారం అన్ని డిపార్ట్మెంట్లను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని,ప్రతి మండల స్థాయిలో స్థానిక నాయకులతో ప్రారంభోత్సవాన్ని కానిచ్చాలన్నారు. జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, యాక్షన్ ప్లాన్ అమలు చేయబడునుందని, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ఆరోగ్య విభాగం, ఐసిడిఎస్, పంచాయతీ రాజ్ మరియు స్త్రీశిశు సంక్షేమ శాఖల సంయుక్త సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రతిరోజు రిపోర్టులను రాష్ట్ర కార్యాలయానికి పంపాలన్నారు.

## ఉష్శ్రీకి పులేరు నేతల పూల సత్కారం



గజమాలలతో సన్మానిస్తున్న రాణా ప్రతాప్ సింగ్

గోరంట్ల సెప్టెంబర్ 26 ప్రభాతవార్త

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెనుగొండ నియోజకవర్గ కమిటీల ఎంపికలు గోరంట్ల మండలంలోని పులేరు పంచాయతీ లీడర్లకు అగ్ర తాంబూలం అందిస్తూ నియోజకవర్గస్థాయి పదవులు రావడంలో మాజీ మంత్రి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ చూపిన చొరవ అభినందనీయం అంటూ పులేరు పంచాయతీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెను నిలువెత్తు గజమాలతో సన్మానించి ఆమెపై తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. పులేరు పంచాయితీ లోని పార్టీ నాయకులకు రెండు కీలక బాధ్యతలు బీసీ సెల్ అధ్యక్షులుగా పులేరు ఉపసర్పంచ్ శ్రీనివాసులు, ఆర్టిఐ సెల్ అధ్యక్షునిగా సురేష్ రెడ్డి లతో పాటు లీగల్ సెల్ అధ్యక్షులుగా విశ్వనాథ్ నాయక్ లను ఎంపిక చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత రాణా ప్రతాప్ సింగ్, శ్రీనివాసులు మరియు సురేష్ రెడ్డి లు ప్రత్యేకంగా తయారు చేయించిన గజమాలను ఉషశ్రీ చరణ్ వేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల కన్వీనర్ వెంకటేష్, పట్టణ కన్వీనర్ మేదర శంకర, బూదిలి సర్పంచ్ అంజి, జీనం వాండ్లపల్లి సాయి, గోరంట్ల ఎంపీటీసీ సోమశేఖర్, గుడిసె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ఆరోగ్య కేంద్రాల ల్యాబ్‌ల పరిశీలన

అనంతపురం వైద్యం సెప్టెంబర్ 16 ప్రభావతవార్త

జిల్లా మలేరియా అధికారి డి.ఓబులు అనంతపురం నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన అంబేద్కర్ నగర్, హమాలీ కాలనీ,నాయక్ నగర్, మంగలి వారి కాలనీ, ఆది మూర్తి నగర్ లోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా,డెంగ్యూ,చికెన్ గున్యా వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ల్యాబ్ ల పనితీరును పరిశీలించారు. జ్వరంతో వచ్చిన వ్యక్తుల నుండి రక్త నమూనాలు తీసుకొని వెనువెంటనే నిర్ధారణ చేసి పరీక్ష ఫలితాలను వైద్యాధికారికి తెలియజేసి తక్షణమే చికిత్స అందే విధంగా చూడాలని ల్యాబ్ టెక్నీషియన్ లను ఆదేశించారు. రికార్డులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అంతేకాక స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ చేయుటకు క్షేత్రస్థాయి సందర్శనలు చేసి సిబ్బంది చేత ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేటట్లు తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని సూచించారు. వార్డ్ ఆరోగ్య కార్యదర్శులు యాప్ పనులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి లో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే, లార్వా సర్వే, మరియు వెక్టార్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. జ్వరాలను తగ్గించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు,ల్యాబ్ టెక్నీషియన్లకు, వార్డ్ సచివాలయ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తో పాటు సబ్ యూనిట్ సూపర్వైజర్ నూర్ భాషా, జిల్లా కేంద్ర మలేరియా ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మకు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవివేకానంద పాఠశాలలో బరోడా బ్యాంక్ మేనేజర్ రాజేష్ చేతుల మీదుగా 12 వేల రూపాయలను అందచేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ సేవా సంస్థ సమాజంలోని పేదలకు విద్యార్థులకు ఎన్నో రకాలైనటువంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడమనేది ఆనందనీయమైనది, అభినందనీయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బరోడా బ్యాంక్ మేనేజర్ రాజేష్, సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు గురప్ప, ప్రధాన కార్యదర్శి రామేశ్వరంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, మహిళ కన్వీనర్ విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, నాగభూషణరావు, సభ్యులు చెన్నయ్య, పెద్దయ్య, నాగేశ్వర్‌రెడ్డి, ఉమాదేవి, మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ యూరియా అందిస్తాం

**జిల్లాకు 1482 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఏడిఏ అల్తాఫ్ అలీ ఖాన్.**



యూరియా స్టాక్ లిస్టును పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం రూరల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

జిల్లాలోని అవసరమైన రైతులందరికీ యూరియా అందిస్తామని ఏడిఏ అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు. మంగళవారం జిల్లాకు వచ్చిన యూరియా స్టాక్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఆర్ సి యఫ్ కంపెనీ కి చెందిన యూరియా 1482.30 మెట్రిక్ టన్నులు వచ్చింది అందులో మార్క్‌ఫెడ్‌కు 899.01.మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్లకు 583.29 మెట్రిక్ టన్నులు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

## స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రామ్ అవగాహన పోస్టర్స్ విడుదల



స్వస్థనారి స్వసక్తి పరివార్ అభయాన్ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి

అనంతపురం వైద్యం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 వ తేదీ నుండి అక్టోబర్ 2, రెండవ తేదీ వరకు రెండు వారాలపాటు స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్యవంతమైన మహిళశక్తివంతమైన కుటుంబం అను సమగ్ర ఆరోగ్య ప్రచార వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ,ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఇందుకు సంబంధించిన పోస్టర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి భ్రమరాంబ దేవి విడుదల చేశారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ ఆరోగ్యం పై అవగాహన పెంచడం, మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం,పోషక ఆహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి, చేయడం అనగా తమ జీవనోపాధికి శక్తివంతంగా, పని చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడానికి అందుకు దోహదం పడటం లాంటి అంశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 433, ఆరోగ్య ఉప కేంద్రాలు, 3 ఏరియా ఆసుపత్రులు, 7, సామాజిక ఆరోగ్య కేంద్రాలు మరియు అనంతపురం సర్వజన వైద్యశాలతో మొత్తం కలిపి 514 ప్రదేశాలలో, సెప్టెంబర్, 17, నుండి అక్టోబర్ 2, రెండవ తేదీ వరకు ప్రతిరోజు ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు మరియు పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## వరుస చోరీలతో బెంబేలు

**- ఒకే రోజు రెండు ఆలయాల్లో దుండగల వీరంగం**

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆలయ కమిటీ సభ్యులు**

రొద్దం. సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



దుండగుల చేతిలో ధంసమైన బీరువా

స్థానిక సుబ్బరాయప్ప గ్రామంలో వెలసిన గ్రామ దేవత పూజమ్మ దేవాలయంలో పెన్నా నది ఒడ్డున వెలసిన శ్రీ సత్య సాయి మందిరంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి బీరువాలు ధ్వంసం చేసి చోరీ చేయడం జరిగింది ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పూజమ్మ దేవాలయంలో దేవి వెండి కవచం మూడు కేజీల వెండి ఆభరణాలు ఆరు గ్రాముల బంగారు తాళిబొట్టు 30 వేల రూపాయలు నగదు ఐదు పట్టుచీరలు సత్య సాయి మందిరంలో దోపిడి దొంగలు ప్రధాన ద్వారం తలుపు బీరువాను ధ్వంసం చేసి నానా బీభత్సం చేశారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది గ్రామాల్లో వరుస దోపిడీ దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు రైతుల విద్యుత్ మోటార్ల కేబుల్లు డ్రిప్పు పరికరాలు పొలాల్లో ఉన్న పైపులు ఎత్తుకెళ్తున్నట్లు రైతులు బోరున విలపిస్తున్నారు గ్రామాల్లో పోలీసులు గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి దుండగులను పట్టుకుంటామని ఎస్సై నరేంద్ర తెలిపాడు

## ఎస్.ఆర్.ఐ.టి విద్యార్థిని ఆత్మహత్య

బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



ధనలక్ష్మి (ఫైల్ ఫోటో)

బుక్కరాయసముద్రం మండల పోలీసుస్టేషన్ పరిదిలోని రోటరీపురం గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్సి మూడవ సంవత్సరం చదువుచున్న ధనలక్ష్మి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు.స్థానికులు పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలు ధనలక్ష్మి సత్యసాయి జిల్లా పెనుగొండకు చెందిన కురబ నాగరాజు కూతురు గా గుర్తింపు. ఈమే సిఎస్సి మూడవ సంవత్సరం చదువుచున్నది. మధ్యాహ్నం ఎన్‌సిసి తరగతుల కు వెల్లి అనంతరం హాస్టల్‌లోని తన రూముకు వెళ్ళింది. చాలా సేపు తరువాత తన తోటి విద్యార్థిని హర్షిత తలుపులను తీయగా రాకపోవడంతో కళశాల యాజమాన్యానికి సమాచారం తెలిపింది. యాజమాన్యం తలుపులు బద్దలు కొట్టి చూడగా ధనలక్ష్మి గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు వోనితో ఉరివేసుకొని వేలాడుతూ కనపడింది. యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సిఐ పుల్లయ్య,ఎస్ఐ రాంప్రసాద్ చేరుకొని పరిశీలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్ట్ నిమిత్తం అనంతపురం జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.